సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



చలి గుప్పిట్లో.. పాలమూరు

ఉమ్మడి పాలమూరులో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి.

వివరాలు 10లో ▸



కరోనా కేసు నమోదు

సుమారు రెండేళ్ల తర్వాత పాలమూరులో మరో కరోనా కేసు నమోదైంది.

వివరాలు 10లో ▸



వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండి అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం . రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



కందనూలు: జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ గదులు, పరిసరాల్లో కలియదిరిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వేదికలుగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మారుస్తానని, త్వరలో క్యాంపు కార్యాలయం నుంచి పాలన కొనసాగిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు నిజాం, రాజు తదితరులున్నారు.

పకడ్బందీగా ప్రజాపాలన నిర్వహణ



నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు గురువారం నుంచి వచ్చే నెల 6 వరకు అర్హులైన ప్రతిఒక్కరి నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని, జిల్లావ్యాప్తంగా అధికారులు గ్రామసభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా, డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతోపాటు అన్ని గ్రామాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేకాధికారుల బృందాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పంచాయతీ స్థాయిలో ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన ప్రతి కౌంటర్‌కు ప్రజాపాలన బోర్డు ఉండాలన్నారు. జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందించడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. గ్రామసభల నిర్వహణపై ఎలాంటి అలసత్వం వహించొద్దన్నారు. జిల్లాలోని 461 గ్రామాలు, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల్లోని 86 వార్డుల్లో మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా పథకాల కోసం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఒకరోజు ముందు దండోరా వేయించాలన్నారు. సమావేశంలో డీపీఓ కృష్ణ, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ జిల్లా సంఘం ఎన్నిక



కందనూలు: నాయీ బ్రాహ్మణ జిల్లా సంఘం ఎన్నికలు మంగళవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా కానుగుల శ్రీనివాసులు (అచ్చంపేట), ప్రధాన కార్యదర్శిగా సురేష్ (కొల్లాపూర్), కోశాధికారిగా కె.శ్యాం (కల్వకుర్తి), గౌరవాధ్యక్షుడిగా వనపట్ల సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, ఎం.సత్యం, కె.జంగయ్యలను ఎన్నుకున్నారు. జిల్లా పరిధిలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన నాయకులతోపాటు 20 మండలాలకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులను సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, నర్సింహ, పురుషోత్తం, శివుడు, బాలస్వామి, మహేష్, శేఖర్, మల్లేష్, సత్యనారాయణ, బాలరాజు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలమూరుకు ఇన్‌చార్జి మంత్రి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం రానున్నారు. ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అధికారులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను కలుసుకోనున్నారు. 11 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

వీడని సందిగ్ధం

ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ చిక్కులు

- అర్హత పరీక్ష తప్పనిసరి చేసిన కేంద్ర విద్యాశాఖ
- కోర్టు ఆదేశాలతో నిలిచిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 9,818 మంది ఎదురుచూపు
- నూతన ప్రభుత్వం చొరవ చూపాలని విన్నపం



అచ్చంపేట: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై నెలకొన్న సందిగ్ధం వీడడం లేదు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరిపై ప్రభుత్వం స్పష్టమైన విధానం వెల్లడించకపోతే సమస్య క్లిష్టంగా మారింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైనా కోర్టు కేసులు, టెట్ ఉత్తీర్ణులైన వారు తమ సీనియార్టీ వివరాలను అందజేయాలని హైకోర్టు ఆదేశించడంతో బ్రేక్ పడింది. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. అయితే బదిలీలు, పదోన్నతులు జరిగితేనే జిల్లాల వారీగా పాఠశాలల్లో ఖాళీల వివరాలు తెలిసే అవకాశం ఉంది. జిల్లాలో టెట్ ఉత్తీర్ణులైన ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ కేంద్రం 2010లో చట్టం చేసింది. దీని ప్రకారం జాతీయ ఉపాధ్యాయ మండలి (ఎన్‌సీటీఈ) ఇదే ఏడాది నిబంధనలు విడుదల చేసింది. సెప్టెంబర్‌లో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సందర్భంగా కొందరు ఉపాధ్యాయులు నిబంధనలు పాటించడం లేదని, బదిలీల్లో స్పౌజ్ కేసులు ఉన్నవారికి పాయింట్లు ఎక్కువ ఇవ్వడంతో నాన్ స్పౌజ్ వారు తమకు అన్యాయం జరుగుతుందని వికారాబాద్, చేవేళ్లకు చెందిన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. అదేవిధంగా 317 జీఓపై హైదరాబాద్ వెళ్లిన కొందరు ఉపాధ్యాయుల ప్రోద్బలంతోనే వీరు కోర్టుకు వెళ్లారనే విమర్శలు కూడా ఉన్నాయి. దీంతో అదే నెల 27న హైకోర్టు టెట్ పాసై ప్రస్తుతం ఉపాధ్యాయులుగా ఉన్నవారు తమ సీనియార్టీ జాబితా ఇవ్వాలని, ఆ ప్రకారమే పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా 2011లో మొదటిసారి టెట్ నిర్వహించగా 2012, 2017 సంవత్సరాల్లో నిర్వహించిన డీఎస్సీ ద్వారా సర్వీస్‌లో చేరారు.

తొమ్మిదేళ్లలో ఒకేసారి..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకే ఒక్కసారి 2015లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. ఆ తర్వాత దాని ఊసే లేదు. అర్హత ఉన్నా పదోన్నతులు దక్కక ఉన్న గ్రేడ్‌తోనే ఉద్యోగ విరమణ పొందినవారు, ఒకేచోట ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుని బదిలీల కోసం ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమై అర్ధంతరంగా ఆగిపోయింది.

ఉమ్మడి జిల్లాలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఇలా..

జిల్లా	ద.చే.ఉ.	బ.అ.హెచ్.	ఖా.ఉ.హెచ్.పో.
మహబూబ్‌నగర్	2,663	87	24
నాగర్‌కర్నూల్	2,478	35	72
వనపర్తి	1,639	31	51
జో.గద్వాల	1,569	28	44
నారాయణపేట	1,469	21	46

ద.చే.ఉ.: దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు,
బ.అ.హెచ్.: బదిలీ అయిన హెచ్‌ఎంలు,
ఖా.ఉ.హెచ్.పో.: ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులు

25 ఏళ్ల సర్వీస్ పూర్తి..

ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సుమారు 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని పదోన్నతులు దక్కక చివరికి అదే కేడర్‌లో ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా, జీహెచ్‌ఎంలు ఎంఈవోలుగా పదోన్నతులు దక్కుతాయనే ఆశతో ఉన్నారు. ఇదిలా ఉండగా బదిలీల ప్రక్రియ ఆగిపోవడంతో చాలామంది ఉపాధ్యాయులు పలుకుబడి ఉపయోగించి ప్రత్యేకంగా బదిలీ ఉత్తర్వులు తెచ్చుకొని వారికి అనుకూలంగా ఉన్న స్కూళ్లలో చేరిపోయారనే ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం చొరవ చూపాలి



బదిలీలు నిలిచిపోవడంతో వేలాది మంది ఉపాధ్యాయులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం స్పష్టమైన విధానం వెల్లడించకపోతే పదోన్నతులు క్లిష్టంగా మారుతోంది. ఉద్యోగ విరమణ పొందే సమయంలో ఉపాధ్యాయులు కోర్టు చుట్టూ తిరగాలా.. సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం చేయకూడదు. డిపార్టుమెంటల్ పరీక్ష తరహాలో దీన్ని నిర్వహించాలి. దీనిపై కొత్త ప్రభుత్వం చొరవ చూపాలి. – బిచ్యానాయక్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

సీనియర్లకు అన్యాయం..



2012కు ముందు రాష్ట్రంలో టెట్ లేదు. జిల్లా నియామక మండలి పరీక్ష ద్వారానే టీచర్ల ఎంపిక జరిగింది. అందువల్ల అనేక మందికి టెట్ అర్హత ఉండే అవకాశం లేదని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించి.. తప్పనిసరి నుంచి మినహాయింపు పొందింది. 2010 ఆగస్టుకు ముందు నియామకమైన వారికి టెట్ అవసరం లేదని ఎన్‌సీటీఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా ఇదే విధానం కొనసాగింది. ప్రభుత్వం పదోన్నతులు కల్పించి టెట్ ఉత్తీర్ణత సాధించేందుకు ఐదేళ్ల గడువు ఇవ్వాలి. – సుదర్శన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



లోకల్‌బాడీ స్కూళ్లలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కోర్టు కేసు కారణాంగా నిలిచిపోయింది. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాల రాలేదు. ఇక తప్పనిసరి టెట్ అనేది జాతీయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) 2010లోనే ఈ నిబంధనలు విడుదల చేసింది. 2011లో మొదటిసారి టెట్ నిర్వహించగా.. 2012, 2017లో నిర్వహించిన డీఎస్సీ ద్వారా చాలా మంది సర్వీస్‌లో చేరారు. అయితే ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత అయితేనే పదోన్నతి అని కోర్టు తీర్పు ఇవ్వడంతో సెప్టెంబర్‌లో జరగాల్సిన బదిలీలు నిలిచిపోయాయి. – గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్

లోకల్‌బాడీ స్కూళ్లలో..

మల్టీజోన్–2 కింద 14 జిల్లాల్లో గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. అయితే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో జీఓ 317 ప్రకారం లోకల్ బాడీకి చెందిన ఉపాధ్యాయులు పరిమితికి మించి రావడంతో మిగిలిన వారికి నష్టం జరుగుతుందని కోర్టును ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన కోర్టు అక్టోబర్ 10న స్టే ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే లోపే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. లోకల్ బాడీ స్కూల్స్ (జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు) పదోన్నతులు, బదిలీలు నిలిచిపోయాయి.

జాడలేని ఏపీడీలు

- కార్యాలయంలోనే కాలక్షేపం చేస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో 'ఉపాధి' పనుల పర్యవేక్షణకు వెళ్లని వైనం
- ప్రభుత్వం నుంచి యథావిధిగా వాహనాల బిల్లు



కల్వకుర్తిలో ఉపాధి హామీ కార్యాలయం



కల్వకుర్తి రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించి.. వలసలు నివారించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు పనులను పర్యవేక్షిస్తున్నప్పటికీ 4, 5 మండలాల పురోగతిని సమీక్షించడంతోపాటు క్షేత్రస్థాయిలో జరిగే అన్ని కార్యక్రమాలను పరిశీలించాలనే ఉద్దేశంతో ఏపీడీలను నియమించింది.

అర్హత లేకున్నా అందలం

ఉపాధి హామీలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు ప్రభుత్వం పలు నిబంధనలను పెట్టింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీనియర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు మాత్రమే ఏపీడీ బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. కానీ, జిల్లాలో ఆ నిబంధనలకు ఉన్నతాధికారులు నీళ్లు వదిలినట్లు సమాచారం. అనర్హులను ఇన్‌చార్జ్ ఏపీడీలుగా అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది.

బాధ్యతలను విస్మరించి..

జిల్లాలో ఏపీడీలు క్షేత్రస్థాయి పర్యటనకు తిలోదకాలు ఇచ్చి కార్యాలయాలకే పరిమితం అవుతున్నట్లు ఆయా శాఖల సిబ్బంది బాహాటంగానే పేర్కొంటున్నారు. 5 మండలాల పరిధిలో పర్యటించాల్సిన ఏపీడీలు వచ్చామా.. వెళ్లామా అనే రీతిలో వ్యవహారం నడిపిస్తున్నారని పలువురు మండల పరిషత్ అధికారులు ఆరోపిస్తున్నారు. కొందరు సొంత బాధ్యతలను విస్మరించి.. తమది కాని పనుల్లో తలదూరుస్తూ ఉన్నతాధికారుల మెప్పుతో నెట్టుకొస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

టూర్ డైరీలు సమర్పించి..

ఉపాధి హామీలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించకున్నా.. అన్ని రకాల బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. కేవలం టూరు డైరీలు సమర్పించి వాహనాల బిల్లులు పెట్టుకుంటున్నారు. ఒక్కొక్క వాహనానికి నెలకు రూ.36 వేల వరకు పొందుతున్నారు. అదనంగా ఆఫీస్ ఖర్చుల పేరిట మరో రూ.3–4 వేలు తీసుకుంటున్నారు. అర్హత లేకపోవడం ఒకటైతే.. ఇన్‌చార్జ్‌లకు ఇన్ని ఫెసిలిటీలు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. చాలా మండలాల్లోని ఉపాధి హామీ కార్యాలయాల్లో వాచ్‌మెన్లను నియమించినా.. వారు ఎక్కడ పనిచేస్తున్నారు.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే జిల్లాలో నలుగురు ఏపీడీలు పనిచేయాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారని వారికే మిగతా మండలాల బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు.

విధుల నిర్వహణ ఇలా..

ఉపాధి హామీలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించే అధికారులు 4, 5 మండలాలకు బాధ్యులుగా ఉంటారు. వీరు ప్రతిరోజు కనీసం రెండు మండలాలను సందర్శించాలి. ప్రతి బుధవారం మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి పనులు జరుగుతున్న తీరు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సిబ్బందితో సమీక్షించాల్సి ఉంటుంది. ప్రతి మండల సమావేశానికి హాజరుకావాలి. అయితే ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న ఏపీడీలు ఆయా కార్యక్రమాలు ఏమీ చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం సోషల్ ఆడిట్ సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నట్లు సమాచారం.

అన్ని విషయాలు పరిశీలిస్తాం..

జిల్లాలో సీనియర్ ఎంపీడీఓలు అందుబాటులో లేకపోవడంతో కోర్సు డైరెక్టర్లను ఇన్‌చార్జ్ ఏపీడీలుగా నియమించాం. ఏపీడీల టూర్ డైరీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – నర్సింగ్‌రావు, డీఆర్‌డీఓ

నిరుపయోగంగా శిక్షణ కేంద్రం



కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రాంతీయ స్థాయి జీవనోపాధుల వనరుల శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారింది. గతంలో జిల్లాస్థాయిలో ఉపాధి హామీతోపాటు ఇతర శిక్షణ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించేవారు. ప్రస్తుతం ఇక్కడ ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో వృథాగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని వేరే శాఖకు అప్పగించి వినియోగంలోకి తెస్తే బాగుంటుందనే పలువురు అభిప్రాయపడుతున్నారు.



శ్రీరామ దూతం.. శిరసా నమామి

41రోజులపాటు కఠోర దీక్ష చేపట్టిన మాలధారులు.. పబ్బతి అంజన్న సన్నిధికి చేరుకుని 'శ్రీరామ దూతం.. శిరసా నమామి' అంటూ దీక్ష విరమణ పొందారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మాలధారుల హనుమాన్ నామస్మరణతో మద్దిమడుగు క్షేత్రం పులకించిపోయింది.

– అమ్రాబాద్

- వివరాలు 8లో..

కల్యాణ వైభోగం..

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతినెల పౌర్ణమి రోజు ఈ పవిత్ర కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ప్రారంభించారు. నేత్రపర్వంగా సాగిన వేడుకను వేలాదిమంది భక్తులు తిలకించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఎన్నికల వేళ.. చదువులెలా?

మొన్న అసెంబ్లీ, ఇప్పుడు స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలు

- టీచర్లకు విధుల కేటాయింపుతో సిలబస్‌పై ప్రభావం
- దగ్గర పడుతున్న పదో తరగతి పరీక్షలు
- పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రుల ఆందోళన



అచ్చంపేట: విద్యా సంవత్సరం ఆరంభంలో ఉపాధ్యాయుల బదిలీలు.. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికలు.. త్వరలో పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాట్లు.. ఆపై ముంచుకొస్తున్న పదో తరగతి పరీక్షలు వెరసి.. విద్యార్థుల చదువులు గందరగోళానికి గురిచేస్తున్నాయి. మరోవైపు అడ్డంకులు అధిగమించి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ సమాయత్తం అవుతోంది. ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీల వల్ల అక్కడివారు ఇక్కడ, ఇక్కడివారు అక్కడ స్థాన చలనం పొందగా.. కొందరు వేరేచోటుకు వెళ్లడంతో నెల రోజుల పాటు చదువులు ఆగమయ్యాయి. గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ సన్నాహాలు ప్రారంభించింది. పెద్దఎత్తున బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించింది. కానీ, విద్యా సంవత్సరం ప్రారంభం సమయానికి చాలా పాఠశాలల్లో కేవలం 65 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు చేరాయి. దసరా సెలవులు, అసెంబ్లీ ఎన్నికల శిక్షణ, నిర్వహణ, ఫలితాల విడుదల తదుపరి పరిణామాలతో సిలబస్ అటకెక్కింది.

త్వరలో 'పంచాయతీ'..

కనీసం ఇప్పుడైనా చదువులు పట్టాలెక్కుతాయనుకుంటే పంచాయతీ ఎన్నికల సన్నాహాలు మొదలయ్యాయి. మరోవైపు మార్చిలో పదో తరగతి పరీక్షలు, ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్ పరీక్షల కోసం విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ముగియగా.. ఆ వెంటనే ఎన్నికల సంఘం పంచాయతీతోపాటు పార్లమెంట్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. జనవరి, ఫిబ్రవరిలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ, ఏప్రిల్ నెలలో లోక్‌సభ ఎన్నికలు, మే నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో విద్యార్థుల చదువులు ఎలా గాడిన పెట్టాలో అర్థం కావడం లేదని ఉపాధ్యాయుల వాపోతున్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లా పరిధిలో..

జిల్లాలో 3,138 మంది ఉపాధ్యాయులుండగా.. వీరిలో దాదాపు అందరూ అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించారు. తాజాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు విడతల వారీగా ఉపాధ్యాయులందరూ శిక్షణకు హాజరయ్యేందుకు ఆదేశాలు వచ్చాయి. మరోవైపు పదో తరగతి విద్యార్థులకు ఫిబవరిలో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ చూస్తోంది. అలాగే జిల్లాలోని 20 మండలాల పరిధిలో 131 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా.. మొత్తం 5,166 మందికి పైచిలుకు విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలకు హాజరు కానున్నారు. పాఠ్యాంశాలు పూర్తి కాక, కొండంత ఉన్న సిలబస్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో లాంగ్వేజ్ పాఠ్యాంశాలు సరిగా బోధించలేదు. చాలా స్కూళ్లలో ఆ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు కూడా లేరు.

ఫలితాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో విద్యా శాఖ పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నవంబరు 1 నుంచి అన్ని పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నడుపుతున్నారు. టీచర్లు ఏటా డిసెంబర్ చివరి వరకు సిలబస్ పూర్తి చేసేవారు. ప్రస్తుతం పలుచోట్ల 75 శాతమే పూర్తయ్యింది. తరగతులు వేగవంతం చేసినా.. విషయాలపై పట్టు సాధించకపోవడం, నెమ్మదిగా సాగితే అనుకున్న సమయానికి పూర్తి చేయలేక విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

పరీక్షల షెడ్యూల్ ఖరారు

ఈసారి విద్యా సంవత్సరం త్వరిగతిన ముగియాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ముందుగానే అన్ని పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి షెడ్యూల్ ఖరారు చేసింది. ఫిబ్రవరిలో సీబీఎస్ఈ, మార్చిలో ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కానీ, ఎన్నికల సీజన్ ఇబ్బందులకు గురిచేస్తోంది. మరోవైపు అడ్డంకులను అధిగమించి, వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ గత నెల ఒకటి నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. దాన్ని పూర్తి చేయడానికి ఎన్నికల విధులు అడ్డంకిగా మారనున్నాయి.

సిలబస్ పూర్తిచేస్తాం..

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులందరూ విడతల వారీగా శిక్షణకు హాజరు కానున్నారు. పదో తరగతి ఫలితాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం. సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి 10 జీపీఏ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఎక్కడైనా సబ్జెక్టు టీచర్లు తక్కువగా ఉంటే సమీపంలోని వారికి బాధ్యతలు అప్పగిస్తాం. – గోవిందరాజులు, డీఈఓ

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



కృష్ణా: మండల సరిహద్దులోని చేగుంట గ్రామ శివారులో కర్ణాటకకు చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మంగళవారం రాత్రి ఎదురెదురుగా ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని వాడి పట్టణానికి చెందిన మర్‌లింగా మరియు రాజ్‌కుమార్ బైక్‌పై బెంగళూర్‌కు వెళ్తుండగా.. శక్తినగర్ నుంచి అనిల్‌కుమార్, మనోహర్ బైక్‌పై తమ స్వగ్రామమైన కడెచూర్‌కు వెళ్తూ.. ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సమయంలో అనిల్‌కుమార్ రోడ్డుపై పడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న మరో వాహనం అనిల్‌కుమార్‌పై వెళ్లడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ట్యాంకర్ డ్రైవర్, బైక్ నడుపుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మెడికల్ విద్యార్థి..



సాయితేజ (ఫైల్)

చిట్యాల(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెడికో మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన బిరుదు సాయితేజ(20) నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో డెంటల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయితేజ తనతో కలిసి చదువుకుంటున్న యశస్వీతో కలిసి సోమవారం ఉదయం బైక్‌పై యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రానికి వెళ్లి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో చిట్యాల వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను భువనగిరి వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా పడిన సాయితేజ, యశస్వీని పోలీసులు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. సాయితేజ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బల్మూర్: మండలంలోని కొండనాగులకి చెందిన యువకుడు మంగళవారం ఉదయం హైదరాబాద్ వెళ్తుండగా.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కొండనాగులకి చెందిన ఆంజనేయులు(30) సోమవారం గ్రామానికి వచ్చి అత్తగారి గ్రామం వంగూరు మండలం చౌదర్‌పల్లికి వెళ్లి మంగళవారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుక్కుగూడ వద్ద డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుడికి భార్య నిర్మలతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పహడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అత్యక్రియలు నిర్వహించారు.

మృతదేహం లభ్యం

కోస్గి: చేపల వేటకు చెక్‌డ్యాంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. మండలంలోని ముశ్రీఫాకు చెందిన బుడగజంగం వెంకటయ్య(32) సోమవారం గ్రామ సమీపంలోని చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో లోతుకు వెళ్లి మునిగిపోయాడు. ఎంతకూ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు వచ్చి చూడగా దుస్తులు కనిపించడంతో గ్రామస్తుల సహకారంతో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఉదయం పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు వాగులో మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ తెలిపారు.

చిరుత కలకలం

అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా గుంపన్‌పల్లి శివారులో చిరుత కలకలం సృష్టిస్తోంది. పశువులపై దాడి చేసి చంపిన సంఘటనలు మరవకముందే ఓ హిళపై దాడికి యత్నించిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. అచ్చంపేట మండలం గుంపన్‌పల్లికి చెందిన సబావట్ రమ తమ వ్యవసాయ పొలంలో పనులు ముగించుకుని ఆవులు, ఇతర పశువులను తీసుకుని సమీప చెరువు వద్ద నీళ్లు తాపడానికి వెళ్లింది. ఈ క్రమంలో చెట్ల పొదల్లో ఉన్న చిరుత ఒక్కసారిగా మహిళపై దాడికి యత్నించింది. గమనించిన ఆ మహిళ పెద్దగా కేకలు వేసింది. ఇది విన్న సమీప పొలాల రైతులు, కూలీలు అక్కడికి చేరుకోవడంతో చిరుత అక్కడి నుంచి పారిపోయింది. మహిళ సొమ్మసిల్లి పడిపోవడంతో రైతులు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొలాలకు వెళ్లాల్సి వస్తోందని..బోనులు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా... అధికారుల నుంచి స్పందన లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

రమణీయం.. అంజన్న రథోత్సవం

- వేలాదిగా తరలొచ్చిన భక్తజనం
- కిటకిటలాడిన రాంలీలా మైదానం
- మార్మోగిన హనుమాన్ నామస్మరణ



పడమటి అంజన్న రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: అశేష జనవాహిని మధ్య మక్తల్ పడమటి ఆంజనేయస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవమూర్తి కొలువుదీరగా.. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య రథోత్సవం ప్రారంభమైంది. మక్తల్, నారాయణపేట ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికా రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ స్వామివారి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బాలాంజనేయస్వామి ఆలయం వరకు లాగారు. భక్తులతో రాంలీలా మైదానం కిటకిటలాడింది. స్వామివారి రథాన్ని లాగేందుకు పలువురు పోటీపడ్డారు. ఈ సందర్భంగా హనుమాన్ నామస్మరణ మార్మోగింది. అంతకుముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు దాసంగాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అంజన్న రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



స్వామివారికి నైవేద్యం తయారు చేస్తున్న భక్తులు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

అంజన్న సేవలో ప్రముఖులు..

అంజన్న రథోత్సవంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ పావని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించగా.. మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని, ఎమ్మెల్యే వాకిటి సతీమణి లలిత, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, జలంధర్‌రెడ్డి, ఎంపీపీ వనజ, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ అఖిలరెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఆశిరెడ్డి, చిట్టెం మాధవరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భీమాచార్య, ఈఓ శ్యాంసుందర్‌రావు, పూజారి ప్రాణేష్‌చారి పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ

చిన్నరాజమూర్.. భక్తజన సందోహం



భక్తులతో కిటకిటలాడుతున్న చిన్నరాజమూర్ అంజన్న ఆలయ ప్రాంగణం

- అంజన్న బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన జాతర మైదానం

దేవరకద్ర: దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్‌లో మంగళవారం అంజన్న నామస్మరణ మార్మోగింది. వేలాది మంది భక్తులతో జాతర మైదానం కిక్కిరిసిపోయింది. ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి.. స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. కొందరు భక్తులు దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు తలనీలాలతో పాటు ఆవులు, కోడె దూడలను సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ప్రభోత్సవం..

చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ప్రభోత్సవాన్ని తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తిని అశ్వ వాహనంపై ఊరేగించారు. అనంతరం కొత్తగా తయారు చేయించిన రథంపై జాతర మైదానం వరకు తీసుకెళ్లారు. ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు.

నేడు రథోత్సవం..

అంజన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం అయిన రథోత్సవం బుధవారం నిర్వహించేందుకు దేవస్థానం వారు ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం అర్ధరాత్రి గజవాహన సేవ అనంతరం తెల్లవారుజాము వరకు స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.



రథంపై స్వామివారికి పూజలు చేస్తున్న పండితులు



భక్తులతో కిటకిటలాడుతున్న కోనేరు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



స్వామి వారికి దాసంగం సమర్పిస్తున్న భక్తులు

ఉప్పొంగిన భక్తిపారవశ్యం

- మద్దిమడుగు అంజన్న క్షేత్రంలో వైభవంగా దీక్ష విరమణ ఉత్సవాలు

అమ్రాబాద్: నల్లమల అటవీ ప్రాంతంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి క్షేత్రంలో మంగళవారం దీక్ష విరమణ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అంజన్న క్షేత్రం కిక్కిరిసిపోయింది. భక్తుల హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. ఈనెల 22నుంచి ప్రారంభమైన ఉత్సవాలు.. ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా కొనసాగాయి. వేలాది మంది మాలధారణ భక్తులు 41రోజుల కఠోర దీక్ష అనంతరం పబ్బంతి అంజన్న సన్నిధికి చేరుకుని దీక్ష విరమణ పొందారు. ఈ సందర్భంగా హనుమాన్ శరణుఘోషతో మద్దిమడుగు క్షేత్రం పులకించిపోయింది.

భక్తిశ్రద్ధలతో హనుమత్ గాయత్రి మహాయజ్ఞం

దీక్షమాల విరమణ ఉత్సవాల ముగింపు సందర్భంగా హనుమత్ గాయత్రి మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి గవ్యాంతర పూజలు, సమీప కృష్ణానది నుంచి 108 కలశాలు, గోదావరి నుంచి 40 కలశాలతో నీటిని తీసుకొచ్చి అభిషేకం, కుంభాభిషేకం చేశారు. ఆలయం ఎదుట నిర్మించిన యజ్ఞశాలలో హనుమాన్ ఉత్సవ మూర్తికి వేద పండితులు నీలకంఠశాస్త్రి, వీరయ్యశర్మల బృందం మంత్రోచ్చరణల మధ్య గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. యాగశాలలో మహా పూర్ణాహుతి అనంతరం స్వామివారికి అవభృతం స్నానం చేయించారు. అష్టాదశ కలశాలు, నాగవల్లిదళం (తమలపాకులు), పుష్పాలంకరణ చేశారు. ఉత్సవాల్లో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి జెడ్పీటీసీ అనురాధ పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి పాల్గొన్నారు.



అగ్నిగుండం వద్ద దాసంగం సమర్పిస్తున్న భక్తులు



హనుమత్ గాయత్రి మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ



లక్డీకాపూల్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్ కుమార్ డబ్బీకార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిరపలో బూడిద తెగులు



మిరప పంట



కాయతొలుచు పురుగు ఆశించిన మిరపకాయ

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: జిల్లాలో ఈ ఏడాది మిరప విస్తారంగా సాగైంది. అయితే ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో బూడిద తెగులు, లద్దె పురుగు ఆశిస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ చెప్పారు. రైతులు సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో నష్టపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. బూడిద తెగులు, లద్దె పురుగు నివారణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

బూడిద తెగులు

రాత్రివేళల్లో వాతావరణం చల్లగా ఉండటం, పగటి పూట ఎండ ఉండటం వలన బూడిద తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు వలన ఆకుల మీద తెల్లని మచ్చలు ఏర్పడతాయి. తర్వాత ఈ మచ్చల నుంచి శిలీంద్ర బీజాలు ఉత్పత్తి అయి ఆకుల మీద తెల్లటి పొడగా ఏర్పడతాయి. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు తెల్లటి పొడలు ఆకుల మీద, పిందెల మీద, కాయల మీద వ్యాప్తి చెందుతాయి. ఆకులు ఎండి పండుబారుతాయి. ఆకుల మీద తెల్లటి పొడ ఏర్పడటం వలన కిరణజన్య సంయోగ ప్రక్రియ తగ్గిపోయి తగినంత ఆహార పదార్థాలు తయారు కాక కాయ నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ ఇలా..

ఈ తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 200 గ్రాములు, డైనోకాప్ 200 మి.లీ., బెలటాన్ 200 మి.లీ., ట్రైడిమార్ఫ్ 200 మి.లీ., అజాక్సి స్ట్రోబీన్ 200 మి.లీ.,లను 200 లీటర్లలో కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి.

కాయతొలుచే పురుగు

ప్రస్తుతం కాయలకు కాయతొలిచే పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు కాయలోపలి భాగానికి ప్రవేశించి లోపల ఉన్న పదార్థాన్ని తినడం వలన కాయ నాణ్యత పడిపోతుంది.

నివారణ ఇలా..

ఈ పురుగు నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు, నువలురాన్ 1.0 మి.లీ., రెనాక్సి ఫైర్ 0.3 మి.లీ., ఫ్లూబెండమయిడ్ 0.3 గ్రాములు, క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ., ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

దాబాలపై పర్యవేక్షణేదీ?

- సింగారం చౌరస్తాలో వివాదాస్పదంగా మారిన వైనం



సింగారం చౌరస్తాలోని దాబాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట: నారాయణపేట మండలం సింగారం చౌరస్తాలో కొనసాగుతున్న దాబాలు రోజు ఏదో ఒక సంఘటనతో వివాదాస్పదంగా మారుతున్నాయి. గతంలో ఓ దాబా మిద్దెపై మద్యం తాగేందుకు వెళ్లిన కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్‌కు చెందిన ఇద్దరు యువకులు విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ ఘటన చోటు చేసుకున్న తర్వాత కూడా దాబాలు మాత్రం నిర్విరామంగా కొనసాగుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది. స్థానిక ఎక్సైజ్ అధికారుల అండదండలతోనే అక్రమంగా దాబాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టరేట్ నూతన భవన నిర్మాణంతో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో అక్రమ దాబాలతో వివాదాలు ఉత్పన్నం అవుతున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం సింగారం స్టేజీ వద్ద ఉన్న దాబాలను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పరిశీలించారు. అయితే దబాల యజమానులు అక్కడ అన్ని సదుపాయాలను ఏర్పాటుచేసి తమ వ్యాపారాలను సాఫీగా సాగిస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన రహదారికి దాబాలు 50ఫీట్ల దూరంలో ఉండాలని నిబంధనలు ఉండగా.. అందుకు విరుద్ధంగా దాబాలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. దాబాల వద్ద అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై కాంగ్రెస్ నాయకులు పలు సందేహాలను వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ జాజాపూర్ జగన్మోహన్ రెడ్డి, కౌన్సిలర్ మహేష్, వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో ఈనాడు ప్రతులను దగ్ధం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల సమ్మె అవాస్తవం

- సమ్మె ప్రచారాన్ని ఖండించిన వలంటీర్ల సంఘాలు

సాక్షి, అమరావతి/చిత్తూరు కలెక్టరేట్/పటమట (విజయవాడ తూర్పు)/వీరఘట్టం: నిన్న మొన్నటి దాకా వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించిన విపక్ష పార్టీలు, వారి అనుకూల పచ్చ మీడియా ఇప్పుడు వలంటీర్లలో కొందరినైనా చీల్చి వారిలో ప్రభుత్వ విద్వేషాన్ని రగిల్చి సమ్మెబాట పట్టించాలన్న కుట్రలు పటాపంచలయ్యాయి. తామెలాంటి సమ్మెలో పాల్గొనడంలేదని వలంటీర్ల సంఘాలు తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో మొత్తం 2.60 లక్షల మంది వలంటీర్లు పనిచేస్తుండగా.. ఆయా వలంటీర్లు తమ వృత్తి సంబంధిత అంశాలపై తలెత్తే సందేహాలు నివృత్తి చేసుకునేందుకు జిల్లాల వారీగా లేదా ఎక్కడికక్కడ అనధికారికంగా సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటుచేసుకున్నారు. కొన్నింటిలో ఎవరికి వారే ఆ గ్రూపుల్లో చేరే అవకాశం ఉండడంతో.. వివిధ ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులు కొందరు వలంటీర్ల ముసుగులో ఆ గ్రూపుల్లోకి దూరి వలంటీర్లను రెచ్చగొట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వంపై రెచ్చగొట్టే పోస్టులు పెడుతూ వచ్చారని వలంటీర్లు చెప్పారు. నిజానికి.. వలంటీర్లకుగానీ, వలంటీర్ల సంఘాల ప్రతినిధులకు గానీ సమ్మె చేయాలని ఎలాంటి ఆలోచన లేకపోయినా ప్రేరేపిత పోస్టులకు స్పందించే ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు సమ్మెకు దిగుతున్నారని మిగిలిన వలంటీర్లను రెచ్చగొట్టి వారితో సమ్మె ముసుగులో ఆందోళన చేపట్టేందుకు తెలుగుదేశం సహా మరికొన్ని రాజకీయ పక్షాలు యత్నిస్తున్నాయి. అయితే, వలంటీర్ల సమ్మెను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు కొట్టిపారేశారు. రాష్ట్రంలో వలంటీర్లు ఎక్కడా విధులు బహిష్కరించినట్లుగానీ, ఆందోళనలు చేపట్టినట్లుగానీ ఎలాంటి సమాచారంలేదని వారు పేర్కొంటున్నారు. ఇక.. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా'కార్యక్రమంలో వలంటీర్లు పూర్తిస్థాయిలో పాల్గొన్నారని వారు స్పష్టంచేశారు. చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతో ఈనాడులో ప్రచురించిన తప్పుడు కథనంపై వలంటీర్లు మండిపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని సీపీఎస్ రోడ్డులో మంగళవారం ఈనాడు ప్రతులతో ఆందోళన చేశారు. రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ ఈనాడు ప్రతులను దగ్ధంచేశారు.

ఆటలతో.. ఆరోగ్యం.. ఆణిముత్యాలు

గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను సానపట్టి దేశానికి అందిస్తాం: సీఎం జగన్

- ప్రతి ఒక్కరికీ వ్యాయామం ఎంత అవసరమో అవగాహన కల్పిస్తాం
- ఇక ఏటా 'ఆడుదాం.. ఆంధ్ర' టోర్నీ
- మెగా టోర్నీని గుంటూరులో ప్రారంభించిన ముఖ్యమంత్రి



గుంటూరు జిల్లా నల్లపాడులో జ్యోతి ప్రజ్వలన చేసి 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రి రోజా, బ్యాడ్మింటన్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'ఆడుదాం ఆంధ్ర'ఆటల పోటీల ద్వారా గ్రామీణ ఆణిముత్యాలను వెలికి తీసి సానపట్టి వజ్రాలుగా మార్చి దేశానికి అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'ను మంగళవారం గుంటూరు జిల్లా నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఇవాళ మొదలవుతున్న ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలుస్తాయని, 47 రోజుల పాటు ఫిబ్రవరి 10వతేదీ దాకా ఊరూరా పండుగ వాతావరణంలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. అందరూ పాల్గొనే ఒక గొప్ప పండుగగా ఇది చరిత్రలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు ప్రధాన లక్ష్యాలు..

'ఆడుదాం.. ఆంధ్ర'కార్యక్రమం వెనుక ప్రభుత్వానికి రెండు ప్రధాన ఉద్దేశాలున్నాయి. ఒకటి.. గ్రామ స్థాయిలోని ఆణిముత్యాలను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడం. రెండోది.. వ్యాయామం, క్రీడల వల్ల అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చు. ఇవి రెండూ సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యాయామం, క్రీడల వల్ల ప్రతి మనిషికి ఆరోగ్యపరంగా ఎంత మేలు జరుగుతుంది? ప్రతి ఒక్కరికీ అవి ఎంత అవసరం? అనే విషయాలను తెలియజేసేందుకు ఇది ఒక అవగాహన కార్యక్రమంలా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల బీపీ కంట్రోల్‌లో ఉంచుకోగలుగుతాం. టైప్ 2 డయాబెటీస్‌ని నిరోధించడంలో క్రీడలు చురుకైన పాత్ర పోషిస్తాయి.

మెంటార్లుగా పీవీ సింధు, శ్రీకాంత్

ఈ క్రీడోత్సవాలు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు జరుగుతాయి. వివిధ స్థాయిల్లో ఆణిముత్యాలను గుర్తించేందుకు ప్రొఫెషనల్ లీగ్ టీమ్స్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తాయి. క్రికెట్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుకు వచ్చాయి. ఆణిముత్యాలను వెతికి వారికి మెరుగులు దిద్ది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఈ టీమ్స్ తోడుగా ఉంటాయి. బ్యాడ్మింటన్‌కు సంబంధించి కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా వారిలో ఒకరికి విశాఖపట్నంలో, మరొకరికి తిరుపతిలో స్థలం ఇచ్చాం. బ్యాడ్మింటన్ అకాడమీలు స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి సహకరిస్తుంది. శ్రీకాంత్, సింధు మెంటార్లుగా వ్యవహరిస్తూ ప్రతిభ ప్రదర్శించే మన పిల్లలకు తోడుగా నిలుస్తారు.

+ ఇక ఏటా ఆటలు..

ఆడుదాం ఆంధ్ర టోర్నీని ప్రతి సంవత్సరం నిర్వహిస్తాం. గ్రామస్థాయి నుంచి మొదలై మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయి. ఏటా ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు గ్రామాల్లో ఆరోగ్యపరమైన అవగాహన కల్పిస్తూ టాలెంట్ హంట్ కొనసాగిస్తాం. తద్వారా మరిన్ని ఆణిముత్యాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. సచివాలయ స్థాయి, మండల స్థాయి నుంచి గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు ప్రొఫెషనల్ కిట్లు పంపిణీ జరుగుతుంది. ఏటా కిట్లు ఇస్తూ మన పిల్లలను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.



వేడుకగా 'ఆట'

జెండా ఆవిష్కరించి ప్రారంభించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేశంలోనే అతి పెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్ర'గుంటూరు శివారు నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జెండాను ఆవిష్కరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడోత్సవాల ప్రారంభ సూచకంగా గాల్లోకి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం బ్యాడ్మింటన్ క్రీడాకారుడు క్రీడాకారిణి సీహెచ్ రమాదేవికి క్రీడల టార్చ్ అందచేశారు. కిడాంబి శ్రీకాంత్‌తో కలసి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం సీఎం జగన్ స్వయంగా మైదానాల వద్దకు వెళ్లి ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి జగన్ కొద్దిసేపు క్రికెట్ బ్యాటింగ్ చేశారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బౌలింగ్ చేయగా మంత్రి రోజా వికెట్ కీపింగ్ చేశారు. సీఎం జగన్ మంచి షాట్లు బాది అందరినీ ఉత్సాహపరిచారు. మంత్రి రోజాకు క్రికెట్ మెళకువలు సూచించారు. అంతకు ముందు పలు క్రీడలకు సంబంధించిన కిట్లను క్రీడాకారులకు అందచేశారు. క్రికెట్ కిట్‌లు, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 5.09లక్షల స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు.

టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు

- పోటు కార్మికులకు వేతనం మరో రూ.పదివేలు పెంపు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడి



గోవింద కోటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

తిరుమల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు కురిపించనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్య నిర్ణయాలు ఇవీ..

- టీటీడీ ఉద్యోగులకు సంబంధించి మొదటి దఫా డిసెంబరు 28న 3,518 మందికి, రెండో దఫా జనవరి మొదటి వారంలో 1,500 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ
- ఇళ్లస్థలాలను ప్రభుత్వం నుంచి టీటీడీ కొనుగోలు చేసి అభివృద్ధి చేసి ఉద్యోగులకు అందిస్తుంది. ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు
- శ్రీవారి పోటు కార్మికులకు మరో రూ.10 వేల వేతనం పెంచాలని నిర్ణయం
- టీటీడీలోని పలు విభాగాల్లో వర్క్ కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలు పెంపు.
- ఇప్పటికే స్కిల్డ్ కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18,500, సెమిస్కిల్డ్ కార్మికులకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.10,340 నుంచిరూ.15 వేలకు పెంపు
- కల్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న పీస్‌రేట్ క్షురకులకు నెలకు రూ.20 వేల కనీస వేతనం
- ఫిబ్రవరిలో తిరుమలలో పీఠాధిపతులు, మఠాధిపతుల సదస్సు
- వందల సంవత్సరాలుగా శ్రీవారి ఆలయ అర్చక కైంకర్యాలను పర్యవేక్షిస్తున్న పెద్దజీయర్ మఠానికి రూ.60 లక్షలు, చిన్నజీయర్ మఠానికి రూ.40 లక్షలు ఆర్థిక సహకారం పెంపు.

కాగా, శ్రీ భగవద్గీత, స్థానిక ఆలయాల క్యాలెండర్లు, గోవింద కోటి పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

నెల్లూరు జిల్లా నార్తురాజుపాలెంలో జరిగిన సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



కోవూరులో సాధికార ప్రదర్శన

నెల్లూరు జిల్లా నార్తురాజుపాళేనికి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర

బ్రహ్మరథం పట్టిన ప్రజలు.. జై జగన్ నినాదాలతో హోరెత్తిన రాజుపాళెం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలన్నీ నార్తురాజుపాళేనికి కదలి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన చేయూతతో తాము సాధించిన సాధికారతను ప్రదర్శించాయి. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాజుపాళెంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశాయి. వారికి రాజుపాళెంలో వీధివీధినా ఘనస్వాగతం లభించింది. జై జగన్ నినాదాలతో రాజుపాళెం హోరెత్తింది. యాత్ర అనంతరం జరిగిన బహిరంగ సభలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. నేతలు సీఎం జగన్ పేరు పలికిన ప్రతిసారీ ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



హన్వాడ సమీపంలో రహదారి కిందకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



హన్వాడలో ఉదయం 8 గంటలైనా కనిపించని సూర్యుడు

చలి గుప్పిట్లో.. పాలమూరు

ఉమ్మడి పాలమూరులో గతంలో ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి.. పల్లె, పట్టణం, చెట్టు, పుట్ట అనే తేడా లేకుండా చలి గుప్పిట్లో చిక్కుకుంది.. సాయంత్రం మొదలు ఉదయం వరకు చిన్నా, పెద్ద, ముసలి అని చూడకుండా గజగజ వణికిస్తోంది. ఉదయం 8 గంటలైనా మంచుతెరలు వీడటం లేదు.. దీంతో 9 గంటల వరకు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. పల్లె ప్రజలు చలిమంటలతో ఉపశమనం పొందుతుండగా.. పట్టణవాసులు స్వెట్టర్లలో ఒదిగిపోతున్నారు. వాహనాలు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నాయి. హన్వాడ సమీపంలో తాండూరు డిపో ఆర్టీసీ బస్సు వెలుతురు కనిపించక రోడ్డు పక్కకు దూసుకెళ్లిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోదిక్కు చలి ఎక్కువ కావడంతో వరి నారు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



జడ్చర్ల వద్ద జాతీయ రహదారి-167ని కమ్మేసిన పొగమంచు, జడ్చర్ల పట్టణంలో ఇలా..



కల్వకుర్తి- తెలకపల్లి రోడ్డుపై దట్టంగా కమ్మేసిన పొగమంచు



గోపాల్‌పేట నుంచి ఏదుట్ల వెళ్లే దారిలో..



మరికల్ శివారులో చలి ప్రభావంతో పెరగని వరినారు



కోస్గి మున్సిపాలిటీలో..



కోడేరులో..



నవాబుపేట మండలం లింగంపల్లి రోడ్డులో..

తొలి కరోనా కేసు నమోదు

- పాలమూరులో 20 ఏళ్ల యువకుడికి పాజిటివ్
- హోం ఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



పాలమూరు: ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్.. మళ్లీ ఇప్పుడు కొత్త వేరియంట్ రూపంలో విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా కేసులు పెరుగుతున్న క్రమంలో మళ్లీ అలజడి మొదలైంది. జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం 14 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా.. ఇందులో 20 ఏళ్ల యువకుడికి కరోనా పాజిటివ్ వచ్చింది. జిల్లాకేంద్రంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పీఆర్‌ఓగా పని చేస్తున్న సదరు యువకుడికి స్వల్ప లక్షణాలు కనిపిస్తే పరీక్ష చేసుకోగా పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం అతడు హోం ఐసోలేషన్‌లో ఉన్నాడని, స్వల్ప లక్షణాలు ఉన్నాయని ఎలాంటి ఇబ్బంది లేదని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ వెల్లడించారు. సదరు యువకుడి శాంపిల్స్ గాంధీ ఆస్పత్రిలోని ల్యాబ్ పంపించి ఏ రకం వైరస్ అని తెలుసుంటామని తెలిపారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఐదు రోజులుగా 151 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చింది.

- కరోనా కేసులు పెరుగుతుండటంతో ఇప్పటికే ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రజలు కరోనా బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా ఆరోగ్య శాఖతో పాటు జిల్లా జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పడకలు సిద్ధం చేయడంతో పాటు ఆక్సిజన్ సిలిండర్లు, పీపీ, పీసీఆర్ కిట్స్, మందుల ఇతరత్రా సామగ్రిని సమకూర్చారు. వాతావరణంలో మార్పుల వల్ల ఈ వైరస్ సోకే ప్రమాదం అధికంగా ఉందని, జాతర్లు, న్యూ ఇయర్ వేడుకలు, సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. గుంపులుగా వెళ్లడం, జన సమూహంలో ప్రయాణించడం వల్ల కరోనా వైరస్ త్వరగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

రామన్‌పాడుకు ఇన్‌ఫ్లో నిల్

మదనాపురం: రామన్‌పాడు జలాశయానికి జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. మంగళవారం సాయత్రం ప్రాజెక్టులో 1,019 అడుగుల మేర నీరు వచ్చి చేరింది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియో గిస్తున్నామని ఏఈ రనిల్ రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ టోర్నీ

రన్నరప్‌గా మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ జట్టు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని హోమిబాబా క్రీడామైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు మంగళవారం ముగిసాయి. టోర్నీలో ఉమ్మడి పాలమూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో రంగారెడ్డి జిల్లా 60 పరుగుల తేడాతో జిల్లా జట్టును ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి బాలికలు 12 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 109 పరుగుల స్కోరు చేశారు. అనంతరం పాలమూరు జట్టు 49 పరుగులకే కుప్పకూలింది.

– అశ్వాపురం